

మావోయిస్టుల డంప్ స్వాధీనం

2 బీజీఎల్ లాంచర్లు, 36 షెల్లు స్వాధీనం



02

ప్రేజాజ్యోతి కథనానికి స్పందన

-బ్లాక్ డైమండ్ స్టేడియం ప్రధాన గేటు ప్రక్కన విద్యుత్ వైరు తొలగింపు

-ప్రజా జ్యోతి పత్రిక ప్రజల పక్షపాతి అని కార్మికులు, ప్రజల అభిప్రాయం




ఇల్లందు, నవంబర్ 19 (ప్రజా జ్యోతి)

ప్రజా జ్యోతి దినపత్రికలో ప్రచురితమైన ఆదమరిస్తే అంతేనా.. అనే కథనానికి సింగరేణి అధికారులు స్పందించారు. జెకె కాలనీలోని బ్లాక్ డైమండ్ స్టేడియం ప్రధాన గేటు ప్రక్కన విద్యుత్ సరఫరా అవుతున్న వైరుకు ప్లాస్టర్ వేసి ఉంచారు.

మిగతా 2లో...

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
20 శుక్రవారం నవంబర్ 2026 | నవంబర్ | 2026 • పేజీలు : 8



అధికారులు పట్టించుకోరు.....?

రెచ్చిపోతున్న ఇసుక మాఫియా....!!

- సింగిరెడ్డిపల్లి ర్యాంపు వ్యవహారంలో అధికారుల తీరుతో తేటతెల్లం
- సింగిరెడ్డి పల్లి ఇసుక సొసైటీ సమ్మక్క-సారక్క సభ్యులకు మేలు జరుగుతుందా ?
- అసలు లబ్ధిదారులెవరూ ?
- పీసా గ్రామ సభ జరిగిందా?
- గుట్టు చప్పుడు కాకుండా సంతకాలు చేయించుకున్నారా?

08

పినపాక,నవంబర్ 19(ప్రజాజ్యోతి)

“ పినపాక మండలం సింగిరెడ్డిపల్లి ఇసుక ర్యాంపు వ్యవహారం: సొసైటీ సభ్యులకా, తెరవెనుక శక్తులకా?

పినపాక మండలం సింగిరెడ్డిపల్లి పరిధిలోని ఇసుక ర్యాంపు వ్యవహారం ఇప్పుడు స్థానికంగా పెద్ద చర్చకు దారితీసింది. సమ్మక్క–సారక్క ఇసుక సొసైటీ పేరుతో సాగుతున్న ఈ వ్యవహారంలో అసలు లబ్ధిదారులు ఎవరు, సొసైటీ సభ్యులకు నిజంగా మేలు జరుగుతోందా లేక తెరవెనుక వేరే ఎవరికైనా కట్టబెట్టారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ”

ఒక పక్క గిన్నెల దందా.. మరో పక్క సింగరేణి సర్వేలో 50 ఫేక్ పేర్లు..!

అమాయకుల పేర్లతో కోట్లు కొల్లగొట్టేందుకు గిన్నెల వ్యాపారి స్కెచ్..?

ఓసీ విస్తరణ సర్వేలో అక్రమంగా నమోదైన 50 పేర్లు.. ఎవరివి..?

ఆ వ్యాపారికి ఏ అధికారితో సంబంధం..? ఏ మధ్యవర్తులతో బేరం ఏంటి..?

పేర్లు నమోదు కావడం వెనుక పెద్ద కుట్ర..?

వెంటనే సర్వే లిస్ట్ బహిర్గతం చేయాలి.. సీబీఐ విచారణ జరిపించాలని నిర్వాసితుల డిమాండ్.

మణుగూరులో గిన్నెల దందాతో మొదలైన గోల్ మాల్.. ఇప్పుడు సింగరేణి ఓసీ విస్తరణ వరకు పాకింది. పేదల జేబులు కొట్టిన





చేతులే.. ఇప్పుడు సర్వే లిస్ట్ లో పేర్లు నమోదు చేయించే స్థాయికి ఎదిగాయా..?

మిగతా 2లో...

ట్యాంక్ నిర్మాణంపై కోట్ల ప్రజా ధనం మట్టిపాలు..!

- నాసిరకం ట్యాంక్ పై కలెక్టర్ చర్యలేవి..?

- వంగితే వంగనీ.. అప్పుడు చూద్దాంలే అనే ధోరణిలో పబ్లిక్ హెల్త్ అధికారులు..!
- ట్యాంక్ పైప్ లైన్ కోసం గుంటలు తవ్వారు.. కానీ అక్కడక్కడా పైపులే వేయలేదు..!
- కాంట్రాక్టర్ ను బ్లాక్ లిస్ట్ లో పెట్టాలి.. అధికారులపై వేటు వేయాలని స్థానికుల డిమాండ్..!





02


మొదటిపేజీ తరువాయి

ట్యాంక్ నిర్మాణంపై కోట్ల ప్రజా ధనం మట్టిపాలు..!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి /

మణుగూరు, నవంబర్ 19, ప్రజాజ్యోతి...

మణుగూరు భగత్ సింగ్ నగర్ లో 2 కోట్ల 28 లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మిస్తున్న అమృత్ నీటి ట్యాంక్ పనులు పూర్తి కాకముందే ఒక పక్కకు వంగిపోయి అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అక్కడి స్థానికులు చూస్తూనే.. "ఇది నాసిరకం నిర్మాణం" అని ఆరోపిస్తున్నారు. ట్యాంక్ కూలి ఇళ్లపై పడితే మా ప్రాణాలకు ఎవరు బాధ్యులని పబ్లిక్ హెల్త్ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ట్యాంక్ నిర్మాణంలోనే కాదు.. దానికి సంబంధించిన పైప్ లైన్ పనుల్లోనూ అదే నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని చెబుతున్నారు. పైప్ లైన్ కోసం అక్కడక్కడా గుంటలు తీశారే తప్ప.. పైప్ సరిగా వేయలేదని విమర్శలు చేస్తున్నారు. రోడ్లు తవ్వి వదిలేయడంతో ప్రజలు రోజూ నరకం చూస్తున్నారని ఆవేదనగా వాపోతున్నారు. ట్యాంక్ నాసిరకం నిర్మాణంపై పత్రికలో ఎన్నిసార్లు కథనాలు వచ్చినా, స్థానికులు ఎన్నిసార్లు చెప్పినా.. పబ్లిక్ హెల్త్ అధికారులు ఒక్కసారి కూడా అటువైపు వచ్చి తనిఖీ చేసిన పాపాన



పోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పత్రిక వివరణలో మాత్రం "మేం వచ్చి పర్యవేక్షిస్తున్నాం" అని చెప్పడం పచ్చి అబద్ధమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణం పట్టించుకోకపోవడం వెనుక లక్షల కమిషన్లు..?

నిజంగా తనిఖీ చేస్తే.. తనిఖీ రిజిస్టర్, ఫోటోలు, నివేదికలు చూపించగలరా అని స్థానికులు నిలదీస్తున్నారు. ఇప్పటివరకు ఏ ఒక్క అధికారి కూడా ప్రజల ముందుకు వచ్చి సమాధానం చెప్పిన పాపాన పోలేదంటున్నారు. నాసిరకం పనులు కళ్లకు కనిపిస్తున్నా.. అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనుక కమిషన్ల వ్యవహారం ఉందని స్థానికుల్లో చర్చ జరుగుతోంది. కాంట్రాక్టర్ కు, పబ్లిక్ హెల్త్ అధికారుల మధ్య లక్షల రూపాయల కమిషన్ల కుమ్మక్కు ఉందని పలు విమర్శలు వినిపిస్తున్నాయి. అందుకే నాసిరకం సామాగ్రి వాడుతున్నా.. అధికారులు చూసీ చూడనట్టు ఉంటున్నారని స్థానికులు అంటున్నారు. పబ్లిక్ సొమ్ము ఇలా బజారుపాలు కాకూడదని.. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ రంగంలోకి దిగాలని మున్సిపాలిటీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే దానికి పబ్లిక్ హెల్త్ అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

మొదటిపేజీ తరువాయి

మావోయిస్టుల డంప్ స్వాధీనం

2 బీజీఎల్ లాంచర్లు, 36 షెల్లు స్వాధీనం

చర్ల,నవంబర్ 19:(ప్రజా జ్యోతి):

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పామేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జీడిపల్లి గ్రామ అడవుల్లో మావోయిస్టులు దాచిన డంప్‌ను పోలీస్, భద్రతా బలగాలు సంయుక్తంగా స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఆపరేషన్‌లో పామేడ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, కోబ్రా 208వ బెటాలియన్ బలగాలు పాల్గొన్నాయి.జీడిపల్లి గ్రామ అడవుల్లో మావోయిస్టులు ఆయుధ సామగ్రిని దాచిపెట్టినట్లు అందిన సమాచారం మేరకు భద్రతా బలగాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో అడవుల్లో ముందుగానే మావోయిస్టులు దాచిన డంప్‌ను గుర్తించి తనిఖీ చేయగా, 2 బీజీఎల్ లాంచర్లు, 36 బీజీఎల్ షెల్లు లభించాయి. వాటిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.బీజాపూర్ జిల్లాలో మావోయిస్టు కార్యకలాపాలను అరికట్టడంతో పాటు ఆ ప్రాంతంలో శాంతి, భద్రతలను నెలకొల్పేందుకు పోలీస్, భద్రతా బలగాలు నిరంతరం గాలింపు, కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శాంతి, భద్రతలతో పాటు అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేందుకు ఆపరేషన్లు కొనసాగుతాయని అన్నారు.అడవుల్లో ఎక్కడైనా అనుమానాస్పద వస్తువులు, పేలుడు పదార్థాలు కనిపిస్తే వాటిని తాకకుండా సురక్షిత దూరంలో ఉండి వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా భద్రతా క్యాంపుకు సమాచారం అందించాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

ఒక పక్క గిన్నెల దందా.. మరో పక్క సింగరేణి సర్వేలో 50 ఫేక్ పేర్లు..!

మొదటిపేజీ తరువాయి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి /

మణుగూరు, నవంబర్ 19, ప్రజాజ్యోతి...

గిన్నెల షాపుల గోల్ మాల్ పై ప్రజాజ్యోతి కథనం ఇంకా మరువక ముందే.. మరో సంచలన విషయం బయటకు వచ్చింది. మణుగూరులో గిన్నెల వ్యాపారం చేస్తున్న ఓ వ్యాపారి.. ఇప్పుడు సింగరేణి ఓసీ విస్తరణ సర్వేలో కూడా చేతులు పెట్టాడని ఫ్లాష్ న్యూస్ బయటకు వచ్చింది. సింగరేణి ఓసీ విస్తరణ సర్వేలో దాదాపు 50 మంది పేర్లు అక్రమంగా నమోదు చేయించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ పేర్లు ఎవరివి..? వాళ్ళు నిజంగా నిర్వాసితులేనా..? లేక కాగితాల మీద మాత్రమే సృష్టించిన పేర్లా..? అన్న అనుమానం ఇప్పుడు మణుగూరులో పెద్ద చర్చకు దారి తీసింది.

అమాయకులను అడ్డం పెట్టుకుని..!

అమాయకులను అడ్డం పెట్టుకుని ఓ గిన్నెల వ్యాపారి ఈ అక్రమానికి పాల్పడ్డారని తెలుస్తోంది. పేదవాళ్ళకు ఏదో ఆశ చూపి.. వారి పేర్లు, ఆధార్ లు, పత్రాలు తీసుకుని.. సర్వేలో నమోదు చేయించారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అసలు వాళ్ళకు ఈ సర్వే వల్ల వచ్చే నష్టం, లాభం ఏంటో కూడా తెలియదని కూడా వినపడుతోంది. ఒకవేళ ఈ 50 పేర్లు నిజమైతే.. భవిష్యత్తులో వారి పేరుతో కోట్ల రూపాయల పరిహారం, ఉద్యోగాలు, ఇళ్ల స్థలాలు కొల్లగొట్టేందుకు పథకం వేసినట్టేనని అనుమానం వ్యక్తం అవుతోంది. గిన్నెల వ్యాపారంలో పేదల జేబులు కొట్టినట్టే.. ఇక్కడ కూడా అమాయకుల పేరుతో కోట్లు కొట్టేయాలన్నదే ఈ స్కెచ్ అని స్పష్టంగా తెలుస్తోంది.

అసలు లింక్ ఏంటి..?

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది.. ఒక సాధారణ గిన్నెల కొట్టు వ్యాపారికి.. సింగరేణి సర్వే అధికారులతో ఏం సంబంధం..? ఆయన పెట్టిన పేర్లు దాదాపు 50 మంది పేర్లు ఎలా నమోదు అయ్యాయి..? ఇటు సింగరేణి అధికారులతో, ఆటు రెవిన్యూ అధికారులతో సంబంధం లేనిదే..? మధ్యవర్తులతో బేరం లేనిదే.. ఇన్ని పేర్లు నమోదు కావు కదా అని అసలైన నిర్వాసితులు నిలదీస్తున్నారు. సర్వే చేసే అధికారులకు, మధ్యవర్తులకు, ఈ వ్యాపారికి మధ్య ఏం ఒప్పందం జరిగింది..? ఎంత మొత్తం చేతులు మారింది..? అన్నది చర్చనీయంశంగా మారింది. ఈ వ్యవహారంపై సింగరేణి, రెవిన్యూ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు. గిన్నెల దందాపై తనిఖీలు చేయాలని అడిగినప్పుడే అధికారులు పట్టించుకోలేదు.. ఇప్పుడు సింగరేణి సర్వేలో కూడా ఇదే నిర్లక్ష్యం కొనసాగితే.. అసలైన నిర్వాసితులకు తీరని అన్యాయం జరుగుతుందని పలువురు హెచ్చరిస్తున్నారు.

ఈ సర్వే లిస్ట్ లో పేర్లు నమోదైన వారి వివరాలు ప్రజాజ్యోతి సేకరిస్తోంది.. వచ్చే సంచికలో మరిన్ని సంచలన వివరాలతో...!

మొదటిపేజీ తరువాయి

ప్రజాజ్యోతి కథనానికి స్పందన

-బ్లాక్ డైమండ్ స్టేడియం ప్రధాన గేటు ప్రక్కన విద్యుత్ వైరు తొలగింపు

-ప్రజా జ్యోతి పత్రిక ప్రజల పక్షపాతి అని కార్మికులు, ప్రజల అభిప్రాయం

దీంతో నిత్యం వందల సంఖ్యలో వాకింగ్ నిమిత్తం వచ్చే వారితో పాటు చిన్నారులు సైతం వస్తుంటారు. పెద్దలకు విద్యుత్ వైరు పట్ల అవగాహన ఉండడంవల్ల దాని దరిదాపుల్లోకి పోయే అవకాశం లేదు. ఒకవేళ చిన్నారులు తెలియక పట్టుకుంటే పరిస్థితి ఏమిటి అనే కథనానికి సింగరేణి అధికారులు స్పందించారు. వెంటనే బ్లాక్ డైమండ్ స్టేడియం ప్రధాన గేటు పక్కన విద్యుత్ సరఫరా అవుతున్న వైరును





తొలగించారు. దీంతో ఇటు కార్మికులు.. అటు ప్రజలు ప్రజా జ్యోతి దినపత్రిక ప్రజల పక్షపాతి అని, నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రజా జ్యోతి దినపత్రిక నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

ఇంటిగ్రేటేడ్ స్కూల్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

ఇల్లందు, నవంబర్ 19 (ప్రజా జ్యోతి)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను గురువారం ఎమ్మెల్యే కోరం కనకయ్య పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఫౌండేషన్ ఫిల్డర్ ప్రాంతాన్ని పరిశీలించి, నిర్మాణ డిపిఆర్ ను మ్యాప్ ను పరిశీలించి నాణ్యతతో త్వరితగతిన పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. ఇన్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం పూర్తి నాణ్యతతో పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





ఇందిరా గాంధీకి ఘన నివాళులు

చర్ల, నవంబర్ 19:(ప్రజా జ్యోతి):

భారత మాజీ ప్రధాని, ఉక్కు మహిళగా పేరుగాంచిన దివంగత ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా చర్లలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. చర్ల మేజర్ పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం నూగూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇర్పా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశాభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం కోసం ఇందిరా గాంధీ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఆమె తీసుకున్న నిర్ణయాలు నేటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేదల అభ్యున్నతికి విశేష ప్రాధాన్యత నిస్తూ, గుడిసెలు లేని గ్రామాల నిర్మాణమే లక్ష్యంగా ఆమె పనిచేశారని గుర్తుచేశారు. పేదరిక నిర్మూలన కోసం ఇచ్చిన 'గరీబీ హటావో' నినాదం ఆమె ప్రజాసంక్షేమ నిబద్ధతకు నిదర్శనమన్నారు.దేశం కోసం అనునిత్యం శ్రమించిన ఇందిరా గాంధీ ఆశయాలను కొనసాగించడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ఇందిరా గాంధీ జీవితం, దేశానికి ఆమె చేసిన సేవలను తెలుసుకునేందుకు కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ రచించిన పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుందరి సురేష్, మేడిచర్ల కుమార్, ఉప్పరిగూడెం మాజీ సర్పంచ్ ఎలకం నరేంద్ర, దోమల రవికాంత్, పటేల్ వెంకటేశ్వర్లు, ముత్యాల సంపత్, కణితి శ్రీను, పూనెం వంశీ, శీలం శ్రీను, మచ్చా వెంకటేశ్వర్లు, మచ్చా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





ఆలయ దొంగల ముఠా అరెస్ట్!

ఓం శక్తి, సాయిబాబా ఆలయాల్లో చోరీ కేసును ఛేదించిన పోలీసులు
ముగ్గురు నిందితుల అరెస్ట్.. రూ.7.54 లక్షల సొత్తు స్వాధీనం
నిందితులపై ఇప్పటికే 33 చోరీ కేసులు!

అశ్వాపురం, నవంబర్ 19:ప్రజాజ్యోతి

అశ్వాపురం మండలంలోని ఓం శక్తి, సాయిబాబా ఆలయాల్లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.7.54 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

తాళాలు పగలగొట్టి ఆభరణాల చోరీ

ఈ నెల 12, 13 తేదీల మధ్య అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయాల తాళాలు పగలగొట్టి 105 గ్రాముల బంగారు ఆభరణాలు, 7 కిలోల 900 గ్రాముల వెండి వస్తువులను అపహరించారు. ఆలయ సూపర్‌వైజర్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వాహనాల తనిఖీల్లో పట్టుబడిన నిందితులు

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాలతో డీఎస్పీ అరుణ్ కుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. గురువారం గొల్లగూడెం శివారులోని సీతారామ కెనాల్ బ్రిడ్జి వద్ద తనిఖీల సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా ఆలయ చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు.

ముగ్గురిపై 33 చోరీ కేసులు

అరెస్టయిన వారు షేక్ జానీ అలియాస్ జానీ షరీఫ్, సప్కా కాంతారావు, ఊర లింగయ్యగా పోలీసులు గుర్తించారు. వీరిలో జానీపై 11, కాంతారావుపై 14, లింగయ్యపై 8 చోరీ కేసులు ఉన్నట్లు వెల్లడైంది. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ అరుణ్ కుమార్ తెలిపారు.

పోలీసు బృందానికి అభినందనలు

కేసును త్వరితగతిన ఛేదించి చోరీ సొత్తును రికవరీ చేసిన అశ్వాపురం పోలీస్ సిబ్బంది, సీసీఎస్ బృందాన్ని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.





బడ్డీ కోచ్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

తాత్కాలిక కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకం

భద్రాచలం ఐటీడీఏ పీవో బి. రాహుల్

భద్రాచలం, నవంబర్ 19 (ప్రజా జ్యోతి):



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ మోడల్ స్పోర్ట్స్ స్కూల్ (బాలికలు), కాచనపల్లిలో తాత్కాలిక కాంట్రాక్ట్ పద్ధతిలో కబడ్డీ కోచ్ నియామకానికి అర్హులైన గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో బి. రాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఎస్, ఎన్ఐఎస్ డిప్లొమా లేదా ఏడాది కాలపరిమితి గల పీజీ డిప్లొమా అర్హత ఉన్న గిరిజన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తు (రెజ్యూమ్)తో పాటు విద్యార్హత ధ్రువపత్రాలను జతచేసి ఐటీడీఏ భద్రాచలంలోని పీఎంఆర్సీ స్పోర్ట్స్ ఆఫీసర్ కార్యాలయంలో వ్యక్తిగతంగా సమర్పించాలి. ఈ నెల 23 నుంచి 28వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 9848988205, 9912362053 నంబర్లలో పని దినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలని పీవో కోరారు.

ప్రతిభకు ప్రోత్సాహం..

-విద్యార్థినికి రూ.10 వేల నగదు బహుమతి

ఇల్లందు, నవంబర్19 (ప్రజా జ్యోతి)

టేకులపల్లి మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన టేకులపల్లి మండలానికి చెందిన చాగంటి హర్షితకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ రూ.10 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేసింది. 'చదువుకో తెలంగాణ--మిషన్ టెన్త్ క్లాస్' కార్యక్రమంలో భాగంగా భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో గురువారం పీవో బి. రాహుల్ చేతుల మీదుగా చెక్కును అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతిభావంతులైన పేద విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు ఉన్నత విద్యకు చేయూతనందించడమే ఈ కార్యక్రమంలో ఏపీవో డేవిడ్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బ్రాంచ్ మేనేజర్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

ఇల్లందు, నవంబర్ 19 (ప్రజా జ్యోతి)

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, రాఘబోయిన గూడెం గ్రామపంచాయతీలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గరీబ్ హటావో అనే నినాదంతో పేదరిక నిర్మూలనకు కృషి చేసిన గొప్ప నాయకురాలు ఇందిరా గాంధీ అని కొనియాడారు. ఇందిరాగాంధీని స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఇందిరా కుటుంబ బీమా పథకం సిద్దిపేట వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించడం జరిగిందన్నారు. దేశ సంక్షేమం కోసం ప్రాణాల సైతం లెక్క చేయకుండా ఇందిరాగాంధీ నిరంతరం ప్రజలకు శ్రేయస్సు కోసమే పని చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మండల రాము, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆదివాసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచాలి

ఎస్టీ కమిషన్‌లో ఏజెన్సీ ఆదివాసీలకే చైర్మన్ పదవులు కల్పించాలి

కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రికి ఆధార్ సొసైటీ వినతి

భద్రాచలం, నవంబర్ 19 (ప్రజా జ్యోతి):

తెలంగాణలోని ఐదవ షెడ్యూల్ ప్రాంతాల ఆదివాసీలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని ఆధార్ సొసైటీ జాతీయ ప్రధాన కార్యదర్శి జేజే రాంబాబు కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రికి వినతిపత్రం సమర్పించారు. రాబోయే నియోజకవర్గాల పునర్విభజనలో గిరిజన అసెంబ్లీ స్థానాలను 8 నుంచి 14కు, పార్లమెంట్ స్థానాలను 2 నుంచి 3కు పెంచాలని కోరారు. భద్రాచలం, ఏటూరునాగారం, ఉట్నూరు పార్లమెంట్ స్థానాలతో పాటు బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్, ఉట్నూరు, జైనూర్, ఏటూరునాగారం, మణుగూరు, భద్రాచలం, అశ్వారావుపేట, లక్ష్మీదేవిపల్లి, ఏనుకూరు, గుండాల, ఎల్లందు, అమ్రాబాద్ అసెంబ్లీ స్థానాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతాల భౌగోళిక విస్తీర్ణం, పెరిగిన గిరిజన జనాభాను పునర్విభజనలో పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర గిరిజన కమిషన్ చైర్మన్, సభ్యులుగా ఏజెన్సీ ప్రాంతాల్లో పుట్టి పెరిగి, ప్రస్తుతం అక్కడే నివసిస్తున్న స్థానిక ఆదివాసీలకే ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గిరిజన భూములు, ఐదవ షెడ్యూల్ హక్కులు, ఆదివాసీ సంస్కృతి, చట్టాలపై ప్రత్యక్ష అవగాహన ఉన్నవారిని నియమించాలని సూచించారు. అలాగే గిరిజన జనాభా, భౌగోళిక విస్తీర్ణం, ఏజెన్సీ పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు పదవీ విరమణ పొందిన ఐఏఎస్ అధికారులు, ఆదివాసీ ఉద్యోగులు, నిపుణులతో రాష్ట్రస్థాయి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. కమిటీ నివేదికను కేంద్ర పునర్విభజన కమిషన్‌కు పంపించి, ఆదివాసీల రాజకీయ ప్రాతినిధ్యం, భూమి, సంస్కృతి, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని జేజే రాంబాబు విజ్ఞప్తి చేశారు.

న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తాం

-చాంబర్ ఎన్నికలు న్యాయబద్ధంగా జరగడం లేదు-ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారు..

-భద్రాచలం సీతారామ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష అభ్యర్థి బచ్చు శ్రీనివాస్

భద్రాచలం, నవంబర్ 19 (ప్రజా జ్యోతి):



భద్రాచలం పట్టణంలో ఈనెల 29న జరగనున్న శ్రీ సీతారామ చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు ఎన్నికల నియమావళికి అనుగుణంగా, న్యాయబద్ధంగా జరగడం లేదని పట్టణ వ్యాపారులు బచ్చు శ్రీనివాస్, కల్కి వాసు, భరత్ ఆరోపించారు. భద్రాచలంలోని ఓ ఫంక్షన్ హాల్లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల అధికారిగా నియమించిన వ్యక్తిని అందరి సమక్షంలో పారదర్శకంగా ఎన్నుకోలేదని అన్నారు. సుమారు 2 వేల మంది సభ్యత్వం కలిగిన చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు నిబంధనల ప్రకారం జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల నియమావళిలో లేని అంశాలను పొందుపరిచి, అభ్యర్థుల అంగీకార పత్రంపై సంతకాలు చేయాలని, సంతకాలు చేస్తేనే పోటీలో కొనసాగుతారని, లేకుంటే అనర్హులవుతారని చెప్పడం సరికాదని బచ్చు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆగస్టు 2 నుంచి కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియలో అనేక అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. తమను పోటీ నుంచి తప్పించేందుకు అంగీకార పత్రంపై సంతకాలు చేయించే ప్రయత్నం జరిగిందని అన్నారు. సుమారు 2 వేల మంది వ్యాపారుల సభ్యత్వ రుసుములకు సంబంధించిన నగదు మొత్తం బ్యాంకు ఖాతాలో జమ చేయలేదని, దీనిపైనా అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు. ఎన్నికల వ్యవహారంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, కోర్టు ఇచ్చే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని బచ్చు శ్రీనివాస్ స్పష్టం చేశారు.

ఏకపక్ష నిర్ణయాలు చెల్లవు : రావులపల్లి

చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు నిబంధనల ప్రకారం న్యాయబద్ధంగా జరగాలని బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్ అన్నారు. రిజిస్టర్డ్ కమిటీలో ప్రతి సభ్యుడికి హక్కులు ఉంటాయని, ఏకపక్ష నిర్ణయాలు సరికాదన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ ఒక వర్గానికి అనుకూలంగా వ్యవహరించడం తగదని పేర్కొన్నారు. వ్యాపార వర్గాలు ఐక్యంగా ఉండి ఇలాంటి కుయుక్తులను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయం

జయంతి వేడుకల్లో ఘన నివాళులర్పించిన పాదెం వీరయ్య

భద్రాచలం, నవంబర్ 19 (ప్రజా జ్యోతి):



భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా భద్రాచలం పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లో ఉన్న ఆమె విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య పాల్గొని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పొదెం వీరయ్య మాట్లాడుతూ దేశ సమగ్రత, సమైక్యత, సార్వభౌమత్వ పరిరక్షణ కోసం ఇందిరా గాంధీ చేసిన సేవలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాలు, రైతులు, మహిళలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆమె తీసుకున్న నిర్ణయాలు, దేశ అభివృద్ధికి చేసిన కృషి మరువలేనివని పేర్కొన్నారు. ధైర్యం, దృఢ సంకల్పంతో దేశానికి నాయకత్వం వహించిన ఆమె జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఇందిరా గాంధీ ఆశయాలు, సిద్ధాంతాల స్ఫూర్తితో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజాసేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పరిమి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వాసిరెడ్డి సాంబశివరావు, సీనియర్ నాయకులు కొమ్మనపల్లి ఆదినారాయణ, తమల్ల వెంకటేశ్వర్లు, ఐఎన్‌టీయూసీ నాయకులు సింగ్, శ్రీనివాస్, మాధవరావు, బంధం శ్రీనివాస్ గౌడ్, కొలపూడి వరుణ్, బత్తుల సాంబయ్య, గానుగ రమణ, శీలం రామ్మోహన్ రెడ్డి, కాపుల శ్రీను, సత్తి, బండారి కృష్ణ (నాని), గర్నేపల్లి అశోక్, బసవరాజు, శెట్టి జయమ్మ, పండాల సరిత, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు చెంచు సుబ్బారావు, సున్నం ఈశ్వరమ్మ, సున్నం భూలక్ష్మి, జగ్గా కుమారి పుల్లయ్య, కొండా తదితరులు పాల్గొన్నారు.

పలు శంకుస్థాపనలు చేసిన జారే ఆదినారాయణ

అశ్వారావుపేట ప్రజా జ్యోతి నవంబర్ 19

అశ్వారావుపేట మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని అశ్వరావుపేట మండలంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాలను ఎమ్మెల్యే ఆదినారాయణ ఆవిష్కరించారు.అనంతరం అశ్వారావుపేట మండలానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులతో పాటు ఎల్ఓసీ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదేవిధంగా వివేకానంద కూడలిలో మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పట్టణ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా నూతన మున్సిపల్ కార్యాలయ నిర్మాణం చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



బాధ్యతగా చదువుకొని లక్ష్యాలను సాధించాలి

విద్యార్థుల చదువుకు ఆర్థిక చేయూత అందించడం అభినందనీయం

భద్రాచలం ఐటీడీఏ పీవో బి. రాహుల్

భద్రాచలం, నవంబర్ 19 (ప్రజా జ్యోతి):



విద్యార్థినీ విద్యార్థులు బాధ్యతగా చదువుకొని జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సూచించారు. లక్ష్యం చేరుకునే వరకు కష్టపడి చదవాలని, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. గురువారం ఐటీడీఏ సమావేశ మందిరంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'చదువుకో తెలంగాణ' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ మండలాల జిల్లా పరిషత్ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి ఫలితాలు పునాది వంటివని, ఉన్నత విద్య అభ్యసించేందుకు మంచి మార్కులు దోహదపడతాయని తెలిపారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ విద్యార్థుల చదువుకు ఆర్థిక చేయూత అందించడం అభినందనీయమన్నారు. ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకొని విద్యాభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు ఆశ్రమ పాఠశాలల్లో ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యార్థులకు కూడా ఇలాంటి ప్రోత్సాహకాలు అందించాలని సంస్థ ప్రతినిధులకు సూచించారు. అనంతరం నియోజకవర్గ స్థాయి ముగ్గురు టాపర్లు అశ్వారావుపేటకు చెందిన కందుకూరి పూజిత, పినపాకకు చెందిన గొంజి జేష్మ రమణిక, కొత్తగూడెంకు చెందిన చాణకుల లక్ష్మీ రమణికలకు లక్ష రూపాయల చొప్పున, 23 మండలాల టాపర్లకు రూ.10 వేల చొప్పున నగదు పురస్కారాలు అందజేశారు. వచ్చే ఏడాది జిల్లా పరిషత్, గిరిజన సంక్షేమ పాఠశాలల విద్యార్థులకు కూడా ప్రోత్సాహకాలు అందించేందుకు రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ చందన, జేడీఎం హరికృష్ణ, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ డీజీఎం సతీష్, ఏరియా మేనేజర్ ఉపేందర్, సంస్థ సిబ్బంది, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ఆశయ సాధనే ప్రభుత్వ లక్ష్యం

-మండలంలోని పలు పంచాయతీలలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

ఇల్లందు, నవంబర్ 19 (ప్రజా జ్యోతి)

మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ఆశయ సాధనే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. గురువారం ఇల్లందు మండలంలోని రాఘబోయిన గూడెం, సుభాష్ నగర్, మొండి తోగు, మసి వాగు, ముత్తారపు కట్ట గ్రామ పంచాయతీలలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఇందిరా కుటుంబ భీమా పథకం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ప్రతి ఇంట్లో మహిళల పేరుతోనే సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల అభివృద్ధికి ఆయా పాలకవర్గాలు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం కేవలం ప్రజా ప్రభుత్వానికే సాధ్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పట్ల ప్రజలకు పెరుగుతున్న నమ్మకాన్ని జీర్ణించుకోలేని ప్రతిపక్ష పార్టీలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, వాటిని నమ్మే స్థితిలో ప్రజలు లేరని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మండల, పట్టణం కాంగ్రెస్ అధ్యక్షులు మండల రాము, భోళ్ల సూర్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ పెండేల రాజు, సర్పంచులు బానోత్ శారదా, ఈసాల సురేష్, వల్లాల మంగమ్మ, గొగ్గెల విజయకుమారి, మూడు సరస్వతి, ధారావత్ సరోజ, ధనసరి స్రవంతి, మెచ్చా సాయమ్మ, పాయం లలిత, నాయకులు ఎట్టి హరికృష్ణ, కున్సోత్ రాము, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, కాకటి భార్గవ్, తాటి బిక్షం, మూతి కృష్ణ, పూనెం సురేందర్, పాయం కృష్ణ ప్రసాద్, కల్తీ పద్మ, ఆరేం కిరణ్ కుమార్, ధనుంజయ్, ఆళ్ల నాగేశ్వరరావు, ప్రసన్న కుమార్ యాదవ్, వడ్లమూడి శ్రీను, దండుగుల శివ, ధనసరి రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

1/70 చట్టం అమలుకు ఆదివాసీ జేఏసీ పిలుపు

నవంబర్ 30న తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

దమ్మపేట, నవంబర్ 19(ప్రజాజ్యోతి):

ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న దమ్మపేట తహసీల్దార్ కార్యాలయం ముట్టడికి ఆదివాసీ జేఏసీ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమానికి ఆదివాసీలను సమీకరించేందుకు గురువారం మండలంలోని వివిధ గ్రామాల ప్రధాన కూడళ్లలో వాల్ రైటింగ్ నిర్వహించారు. గ్రామగ్రామాన ఉన్న ఆదివాసీలు ముట్టడి కార్యక్రమానికి తరలిరావాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో దాఖలైన కేసులను ఉపసంహరించుకునే వరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. న్యాయపోరాటం ద్వారానే ఆదివాసీల హక్కులు, చట్టాలను పరిరక్షించుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కొర్సా వెంకటేష్ దొర, కారం బోడయ్య, కారం నాగేంద్రబాబు, బండారు సూర్యనారాయణ, పద్ధం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వనమా రాఘవేంద్ర ఘనంగా జన్మదిన వేడుకలు

పాత పాల్వంచలో అంబరాన్నంటిన సంబరాలు

కొత్తగూడెం నియోజకవర్గానికి భవిష్యత్తులో దిక్సూచిగా నిలవనున్న వనమా రాఘవేంద్ర: ముత్యాల ప్రవీణ్ కుమార్

పాల్వంచ, నవంబర్ 19, ప్రజాజ్యోతి:

బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు వనమా రాఘవేంద్ర జన్మదిన వేడుకలు పాత పాల్వంచలో ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ వేడుకలు అభిమానులు, పార్టీ కార్యకర్తల సందడితో ఉత్సాహభరితంగా సాగాయి. 46వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల ప్రవీణ్ కుమార్--శ్రీలత దంపతులు, 47వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మిరియాల అలివేలు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం బాణాసంచా కాల్చుతూ, నృత్యాలు చేస్తూ కార్యకర్తలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ముత్యాల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. వనమా రాఘవేంద్ర రానున్న రోజుల్లో కొత్తగూడెం నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తూ ప్రజలకు దిక్సూచిగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వనమా రాఘవేంద్రకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.





వజ్రమ్మ మృతికి సంతాపం

ఇల్లందు, నవంబర్ 19 (ప్రజా జ్యోతి)

ఇల్లందు మున్సిపల్ 9వ వార్డు కౌన్సిలర్ గందే పద్మ సదానందం అత్తమ్మ గందే వజ్రమ్మ గురువారం ఉదయం మృతి చెందారు. మరణ వార్త తెలియగానే మున్సిపల్ వైస్ చైర్మన్ పెండేల రాజు, కౌన్సిలర్లు కొర్లపాటి శివ కిరణ్, మెరుగు కార్తీక్, సైదా మియా, శనిగారపు శృతి వారి నివాసానికి వెళ్లి వజ్రమ్మ మృతదేహం పై పూలమాలవేసి, కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.



మర్కోడులో ఘనంగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

ఆళ్ళపల్లి,నవంబర్19(ప్రజా జ్యోతి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్ళపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మర్కోడు గ్రామపంచాయతీలో భారత మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా దేశ అభివృద్ధికి ఇందిరా గాంధీ అందించిన సేవలను, ఆమె నాయకత్వాన్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామపంచాయతీల సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సెల్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరైన గీతాశ్రీ

అశ్వారావుపేట నుంచి భారీగా తరలివచ్చిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు

అశ్వారావుపేట ప్రజా జ్యోతి రూరల్ నవంబర్ 19

అశ్వారావుపేట మున్సిపాలిటీ నుంచి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి అశ్వారావుపేట 17వ వార్డు కౌన్సిలర్ గీతాశ్రీ హాజరయ్యారు. ఈ సమావేశంలో పార్టీకి సంబంధించిన పలు అంశాలపై నాయకులు చర్చించారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట పట్టణం నుంచి గీతాశ్రీతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ కార్యక్రమాలపై ఆసక్తితో నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరై తమ భాగస్వామ్యాన్ని చాటుకున్నారు.

అశ్వారావుపేట నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో సమావేశంలో స్థానిక పార్టీ శ్రేణుల ప్రాతినిధ్యం కనిపించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు

రోడ్డుపైనే ఆటో అడ్డా!

ఇల్లందు, నవంబర్ 19 (ప్రజా జ్యోతి)

ప్రజల రాకపోకలకు సౌకర్యంగా ఉండాల్సిన రహదారులు కొందరి స్వప్రయోజనాలకు అడ్డాలుగా మారుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని 7వ వార్డుకు వెళ్లే రహదారిపై ఆటోలు రోడ్డుకు ఇరువైపులా నిలిపివేస్తుండటంతో అసలు రహదారి ఎక్కడుందో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు, ప్రజా ప్రతి నిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై ఆటోల నిలుపుదల కారణంగా నిత్యం రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగు తుందని, ప్రమా దాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



- కనబడకుండా పోతున్న రహదారి
- ప్రమాదాలకు నిలయంగా మారుతున్న వైనం!
- రోడ్డుకు ఇరువైపులా బారులు తీరుతున్న ఆటోలు?
- వాహనదారులు, పాదచారులకు తప్పని ఇబ్బందులు
- 7వ వార్డుకు వెళ్లే ప్రధాన రహదారిపై ఆక్రమణల ఆరోపణలు
- రహదారి స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని పలువురి ఆవేదన
- ఆటో అడ్డాను తొలగించి రాకపోకలకు మార్గం సుగమం చేయాలని డిమాండ్
- ప్రజల ఇబ్బందులు అధికారులకు కనిపించడం లేదా?

రోడ్డుకు ఇరువైపులా ఆటోలే!

7వ వార్డుకు వెళ్లే రహదారిపై ఆటోలను క్రమ పద్ధతిలో నిలిపి వేయ కుండా రోడ్డుకు ఇరు వైపులా బారులు తీరు స్తున్నారని స్థానికులు చెబు తున్నారు. దీంతో రహదారి విస్తీర్ణం క్రమంగా కుదించుకు పోయి వాహనాలు ఎదురెదురుగా వెళ్లలేని పరిస్థితి ఏర్పడు తుందని వాపోతున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు.

ప్రమాదాలకు నిలయంగా మారుతున్న రహదారి!

రహదారిపై ఆటోలు అడ్డంగా నిలిపి ఉంచడం వల్ల ద్విచక్ర వాహనదారులు, పాద చారులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని స్థానికులు, ప్రజా ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకునే క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుందని చెబుతున్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీసే పరిస్థితులు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు.

స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయా?

రహదారికి సంబంధించిన స్థలాలు సైతం ఆక్ర మణలకు గురవుతున్నాయనే ఆరో పణలు పలువురి నుంచి విని పిస్తున్నాయి. ఆటోల నిలుపుదలకు ప్రత్యేక స్థలం లేకపోవడం ఒక సమస్య అయితే, రహదారి స్థలాలను కూడా వినియోగించు కుంటు న్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో శివాలయం ఎదురుగా ఉన్న గల్లీలో వివిధ ప్రాంతాలకు వెళ్లే ఆటోల అడ్డా ఉండేది. ప్రస్తుతం అక్కడ అడ్డాను నిర్వహించడంతోపాటు మరొక అడ్డాను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసినట్లు కండ్లకు కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి రహదారి హద్దులను గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకునే నాథుడే లేరా?

నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బం దులు అధికారులకు కని పించడం లేదా? అనే ప్రశ్నలు ఉత్పన్న మవుతున్నాయి. రహదారిపై ఆటోల నిలుపుదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసు కోవడం లేదని స్థానికులు ప్రశ్ని స్తున్నారు. సమస్యను పరిష్క రించాల్సిన బాధ్యత ఎవరిదనే చర్చ కూడా ప్రజల్లో సాగుతుంది.

ఆటో అడ్డాను తొలగించాలి!

ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగి స్తున్న ఆటోల నిలుపు దలను వెంటనే క్రమ బద్ధీకరించాలని, అవసరమైతే ప్రత్యామ్నాయంగా ప్రత్యేక ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. రహదారిని ఆక్రమణల నుంచి కాపాడి, వాహనాలు సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మున్సిపల్, ట్రాఫిక్ సంబంధిత అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై త్వరలో జిల్లా అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేయనునట్లు సమాచారం. ప్రజల కోసం ఉండాల్సిన రహదారులు ఆటోల అడ్డాలుగా మారితే సామాన్యుల పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 7వ వార్డు ప్రజల ఇబ్బందులను తొలగిస్తారా? లేక సమస్యను ఇలాగే కొనసాగనిస్తారా? అన్నది తెలియాలంటే వేచి చూడాల్సిందే.



పదో తరగతిలో మండల టాపర్ కి రూ.10 వేల నగదు ప్రోత్సాహం

ఆళ్ళపల్లి. నవంబర్ 19(ప్రజా జ్యోతి)

శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా పదో తరగతి మండల టాపర్లకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నారు. ఇందులో భాగంగా ఆళ్ళపల్లి మండల కేంద్రానికి చెందిన యాసారపు చరణ్య పదో తరగతి వార్షిక పరీక్షల్లో మండల స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ రాహుల్ చేతుల మీదుగా చరణ్యకు రూ.10 వేల నగదు ప్రోత్సాహంతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. విద్యార్థిని ప్రతిభను పలువురు అభినందించారు.



మహిళా సాధికారతకు సమైక్య భవనాలు అండ

మహిళలు ఆర్థికంగా ఎదిగి స్వయం సమృద్ధి సాధించాలి

నాలుగు గ్రామాల్లో నూతన భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే జారె

దమ్మపేట, నవంబర్ 19(ప్రజాజ్యోతి):



మహిళా సంఘాల బలోపేతం, మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా దమ్మపేట మండలంలోని గండుగులపల్లి, రెడ్యాలపాడు, శ్రీరామపురం, మారప్పగూడెం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన మహిళా సమైక్య భవనాలను గురువారం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మహిళా సమైక్య భవనాలను నిర్మిస్తోందన్నారు. గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి పొదుపు, రుణాలు, స్వయం ఉపాధి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళలకు ఈ భవనాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. మహిళా సంఘాల సమావేశాలు నిర్వహించుకోవడంతో పాటు సంఘ కార్యకలాపాలకు ఈ భవనాలు శాశ్వత వేదికలుగా నిలుస్తాయన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి తమ కుటుంబాల అభివృద్ధితో పాటు గ్రామాల అభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి. రవీందర్ రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ శ్రీధర్, వెలుగు సీసీ సంతోష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కూరం సత్యవతి, కొయ్యల అచ్యుతరావు, ఎర్రా వసంతం, మాజీ ఎంపీపీ సోయం ప్రసాద్, ఎర్రగొర్ల రాధాకృష్ణ, మడకం రాజేష్, సోయం దావీద్, సర్పంచులు మెచ్చు ఈదప్ప, పూచి నాగసులోచన, పూనెం వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పెంట్లం వద్ద రోడ్డు ప్రమాదం.. ఇద్దరికి గాయాలు

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ప్రమాదం

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 19, (ప్రజా జ్యోతి):



అన్నపురెడ్డిపల్లి మండలంలోని పెంట్లం గ్రామంలో గురువారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు ద్విచక్ర వాహ నాలు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. సాయంత్రం 6 గంటల సమయం లో జరిగిన ఈ ప్రమాదంలో బుల్లెట్ ద్విచక్ర వాహనం, టీవీఎస్ వాహనం ఢీకొన్నాయి. వివరాల్లోకి వెళితే.. టీఎస్03 ఈఎం 3949 నంబర్ గల బుల్లెట్ వాహనంపై వస్తున్న స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన టేకుల ప్రదీప్ (25), తండ్రి మొగిలి, టీవీఎస్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో టీవీఎస్ వాహనంపై ప్రయాణిస్తున్న ములకలపల్లి మండలం రాజాపురం గ్రామానికి చెందిన బొంగ రాజులు (30), తండ్రి వీరస్వామికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అన్నపురెడ్డిపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాద వివరాలను పరిశీలించారు. క్షతగాత్రుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నందున ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని అన్నపురెడ్డిపల్లి ఎస్సై విజయసింహారెడ్డి తెలిపారు.

సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పార్లమెంటరీ కమిటీ హామీ

17 అంశాలతో వినతిపత్రం సమర్పణ.. త్వరగా చర్యల నివేదిక ఇవ్వాలని సింగరేణి సీఎండీకి సూచన

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: డైరెక్టర్ గౌతమ్ పోట్రు

సింగరేణి ప్రతినిధి, నవంబర్ 19, ప్రజా జ్యోతి :

సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పార్లమెంటరీ కమిటీ సూచించింది. హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో గురువారం నిర్వహించిన పార్లమెంటరీ కమిటీ సంక్షేమ సమావేశంలో సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలకు సంబంధించి 17 అంశాలతో కూడిన వినతిపత్రాన్ని కమిటీ తాత్కాలిక అధ్యక్షుడు మల్లు రవికి ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ప్రతినిధులు అందజేశారు. ఈ వినతిపత్రంపై స్పందించిన మల్లు రవి సింగరేణి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బుద్ద ప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రులతో చర్చించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యల నివేదికను త్వరగా సమర్పించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను ప్రాధాన్యతతో పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిటీ సూచించినట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి డైరెక్టర్ గౌతమ్ పోట్రు మాట్లాడుతూ పార్లమెంటరీ కమిటీ అధ్యక్షుడు ప్రస్తావించిన ఉద్యోగుల సమస్యలపై స్పందిస్తామని, సంస్థ చైర్మన్‌తో చర్చించి సమస్యల పరిష్కారానికి తక్షణమే ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు, ప్రధాన సమన్వయ అధికారి, మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్, సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఈ. రాజేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎం. వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి కనుకుల తిరుపతి, కార్యవర్గ సభ్యుడు ఈ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అమరుల స్ఫూర్తితో ముందుకు నడుద్దాం- విమలక్క

అమరుల త్యాగాలు విప్లవోద్యమానికి స్ఫూర్తిదాయకం

ఘనంగా చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి అమరుల

గుండాల నవంబర్ 19 ప్రజా జ్యోతి



అమరుల త్యాగాలు విప్లవోద్యమానికి స్ఫూర్తిదాయకమని, అమరుల స్ఫూర్తితో ముందుకు నడవాలని సాంస్కృతిక సమైక్య జాతీయ గౌరవాధ్యక్షురాలు విమలక్క అన్నారు గురువారం గుండాల మండల కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి స్తూపం వద్ద 42వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో విమలక్క మాట్లాడారు. వివిధ ప్రజా ఉద్యమాలలో అలుపెరుగని పోరాటం నిర్వహించి ప్రాణ త్యాగాలు చేసిన అమరుల స్ఫూర్తి మరువలేనిదని అన్నారు. నక్సల్ బరి ఉద్యమ ప్రభావంతో గోదావరిలోయ ప్రాంతంలో విప్లవోద్యమ నిర్మాణంలో చంద్ర పుల్లారెడ్డి కీలక పాత్ర పోషించి, అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి ప్రజా పోరాటాల నిర్వహించి అమరుడైన లని చంద్ర పుల్లారెడ్డి, మరణించిన ప్రజల హృదయాల్లో చిరస్మరణీయంగా ఉంటారని కొనియాడారు. అమరవీరుల ఆశయాలు, వారి త్యాగాలు, పోరాట స్ఫూర్తిని తీసుకెళ్లడం ద్వారా భవిష్యత్ తరాలకు తెలియజేయడమే ఈ వర్ధంతి సభలో ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. చంద్ర పుల్లారెడ్డి 42వ వర్ధంతి సభ సందర్భంగా ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి రైతు కూలీ సంఘం నాయకులు మోకాళ్ళ సమ్మయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు నాగిరెడ్డి సగశిలా మహిళా సంఘం శ్రీ విముక్తి రాష్ట్ర కన్వీనర్ అరుణ అక్క, రైతు కూలీ సంఘం రాష్ట్ర కన్వీనర్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు కొడెం వెంకటేశ్వర్లు, న్యూ డెమోక్రసీ నాయకులు కోరం సీతారాములు, ఏఐకేఎంఎస్ నాయకులు గడ్డం లాలయ్య, ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా నాయకులు వాగబోయిన చంద్రయ్య దొర, అన్నగారిన కులాల జాతీయ నాయకులు బొమ్మెర్ల శ్రీనివాస్,, బీఎస్పీ నాయకులు బొమ్మల రాంబాబు, తుడుం దెబ్బ నాయకులు చింత వెంకటేశ్వర్లు, గోవింద నరసింహారావు, నాయకులు మధు సురేష్ తదితరులు పాల్గొన్నారు

పురుషుల సేవలు అభినందనీయం

ఘనంగా అంతర్జాతీయ పురుషుల దినోత్సవ వేడుకలు

దమ్మపేట, నవంబర్ 19(ప్రజా జ్యోతి):



దమ్మపేట పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అంతర్జాతీయ పురుషుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి. ఉషారాణి పురుష ఉపాధ్యాయులతో కలిసి కేక్ కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సమాజంలో పురుషుల పాత్ర, కుటుంబం పట్ల వారి బాధ్యతలు, సమాజ అభివృద్ధిలో వారు అందిస్తున్న సేవలను వివరించారు. విధి నిర్వహణతో పాటు కుటుంబ, సామాజిక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న పురుషుల సేవలను గుర్తించి గౌరవించడం ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మహిళా ఉపాధ్యాయులు తమ సహచర పురుష ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సరదా ప్రశ్నలు, వినోదభరిత కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులందరూ కలిసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు టి. ఉషారాణి, ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారులు పట్టించుకోరు.....? రెచ్చిపోతున్న ఇసుక మాఫియా....!!

మొదటిపేజీ తరువాయి



సింగిరెడ్డిపల్లి ర్యాంపు వ్యవహారంలో అధికారుల తీరుతో తేటతెల్లం
– సింగిరెడ్డి పల్లి ఇసుక సొసైటీ సమ్మక్క–సారక్క సభ్యులకు మేలు జరుగుతుందా ?
అసలు లబ్దిదారులెవరూ ?
– పీసా గ్రామ సభ జరిగిందా?
గుట్టు చప్పుడు కాకుండా సంతకాలు చేయించుకున్నారా?

పీసా గ్రామ సభపై అనుమానాలు

ఏజెన్సీ ప్రాంతంలో ఇసుక క్వారీలు, ర్యాంపుల నిర్వహణకు సంబంధించి పీసా గ్రాజూూా) గ్రామ సభ నిర్వహణ అత్యంత కీలకం. అయితే, సింగిరెడ్డిపల్లి విషయంలో నిబంధనల ప్రకారం గ్రామ సభ సక్రమంగా జరిగిందా, లేక గుట్టుచప్పుడు కాకుండా సంతకాలు సేకరించుకున్నారా అనే ప్రశ్నలు తలెత్తు తున్నాయి. స్థానిక గిరిజనుల భాగస్వామ్యం, ఆమోదం లేకుండానే ప్రక్రియ ముగించారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా డంపింగ్?

ర్యాంపు నుంచి తవ్విన ఇసుకను కేటా యించిన లొకేషన్‌తో సంబంధం లేకుండా ఇష్టారాజ్యంగా డంపింగ్ చేస్తున్నా సంబంధిత యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. తనిఖీలు చేయా ల్సిన అధికారులు కళ్లప్పగించి చూస్తూ, ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్న తీరుపై స్థానికులు మండిపడుతున్నారు.ఈ వ్యవ హారంలో కొందరు అధికారులకు ముడుపులు ముట్టాయంటూ మండలంలో పెద్ద ఎత్తున ప్రచారం, ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమాలను అడ్డుకోవాల్సిన వారే మిన్నకుండిపోవడంతో "దోచు కున్నోడికి దోచుకున్నంత" అన్నట్లు పరిస్థితి మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సొసైటీ సభ్యుల పరిస్థితి ఏమిటి?

సమ్మక్క–సారక్క సొసైటీ పేరుతో సభ్యులకు ఆర్థికంగా న్యాయం జరుగుతోందా, లేక పేరుకే సొసైటీ ఉందా అనేది తేలాల్సి ఉంది.

అసలు సూత్రధారులు ఎవరు?

సొసైటీ ఎవరి ఆధీనంలో ఉంది, ఆచరణలో ర్యాంపు నిర్వహణ బాధ్యత ఎవరి చేతుల్లో ఉందనే అంశంపై సమగ్ర విచారణ జరగాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పీసా గ్రామ సభ తీర్మానాలు, సొసైటీ సభ్యుల వివరాలు, డంపింగ్ అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని స్థానికంగా డిమాండ్ వినిపిస్తోంది.

సింగిరెడ్డిపల్లి ఇసుక డంపింగ్ వ్యవహారం: 'గుడ్డోడు కళ్లద్దాలు పెట్టుకున్నట్లు' అధికారుల తీరు!

పినపాక మండలం సింగిరెడ్డిపల్లి గ్రామ పరిధిలో సమ్మక్క–సారక్క ఇసుక సొసైటీ పేరుతో సాగుతున్న అక్రమ డంపింగ్ వ్యవ హారంపై సంబంధిత అధికారుల వ్యవ హారశైలి తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా ఇసుక నిల్వలు చేరుతున్నా, పర్య వేక్షిం చాల్సిన యంత్రాంగం మాత్రం "గుడ్డోడు కళ్లద్దాలు పెట్టుకున్నట్లు' 'ఏమీ పట్టనట్లు వ్యవ హరిస్తోందని స్థానికులు మండి పడుతున్నారు. సొసైటీ నిబంధనల ప్రకారం ఇసుక తవ్వకాలు, రవాణా, డంపింగ్‌కు నిర్దిష్టమైన అనుమతులు, లొకేషన్లు ఉంటాయి. కానీ సింగిరెడ్డిపల్లిలో మాత్రం ఎలాంటి నిబంధనలు పాటించ కుండా, అనుమతి లేని ప్రాంతాల్లో భారీ ఎత్తున ఇసుకను డంపింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి.

కానరాని తనిఖీలు:

క్షేత్రస్థాయిలో అక్రమ డంపింగ్ కళ్లముందే కనిపిస్తున్నా, రెవెన్యూ, మైనింగ్, ఇతర శాఖల అధికారులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సమ్మక్క–సారక్క సొసైటీ పేరును అడ్డుపెట్టుకుని తెరవెనుక కొందరు వ్యక్తులు అక్రమ వ్యాపారానికి తెరలేపారన్న విమ ర్శలు వినిపిస్తున్నాయి.ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు నేరుగా రంగంలోకి దిగి, సింగిరెడ్డిపల్లిలో జరుగుతున్న అక్రమ ఇసుక డంపింగ్‌పై విచారణ జరిపి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్

ములకలపల్లి, నవంబర్ 19 (ప్రజాజ్యోతి)

:రైతులు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం. రాజేందర్ సూచించారు. గురువారం ములకలపల్లి మండల రైతు వేదికలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడంతోపాటు నకిలీ విత్తనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదులు తీసుకొని భద్రపరుచుకోవాలని సూచించారు. నాణ్యతలేని విత్తనాల వల్ల పంట నష్టం జరిగితే చట్టపరంగా పరిహారం పొందే అవకాశం ఉందన్నారు. రైతులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సలహాలు, సహాయం పొందవచ్చని భరోసా ఇచ్చారు. అనంతరం బాల్య వివాహాల నిరోధక చట్టం, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండని బాలికలకు, 21 ఏళ్లు నిండని బాలురకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. బాల్య వివాహాలు పిల్లల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. చిన్నారులను లైంగిక వేధింపుల నుంచి రక్షించేందుకు పోక్సో చట్టం అమల్లో ఉందని, వారి భద్రతపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, వ్యవసాయ అధికారి అరుణ్‌బాబు, వ్యవసాయ విస్తరణ అధికారులు సూరిబాబు, రాహుల్‌గాంధీ, సుజాత, సీడీపీవో లలిత, ఎయిడ్ ఎన్జీవో ప్రతినిధులు జ్యోతి, మౌనిక, సర్పంచులు చంద్రలేఖ, సుజాత, ఊకే ఆదిలక్ష్మి, పారాలీగల్ వాలంటీర్లు వీరభద్రం, భిక్షమయ్య, జానకిరాం, అంగన్‌వాడీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



క్రమం తప్పకుండా కళాశాలకు హాజరుకావాలి

విద్యార్థులకు డీఐఈఓ హెచ్. వెంకటేశ్వరరావు

ములకలపల్లి, నవంబర్ 19 (ప్రజాజ్యోతి):

విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరవుతూ, పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ) హెచ్. వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం ములకలపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యాబోధన తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వం అందించిన ఉచిత యూనిఫాంలను డీఐఈఓ, కళాశాల ప్రిన్సిపాల్ కె. కల్పన విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలకు సమయం తక్కువగా ఉన్నందున విద్యార్థులు ప్రతిరోజూ కళాశాలకు హాజరుకావాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుతూ మంచి మార్కులు సాధించాలని, కళాశాల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని కోరారు.




రూ.30 కోసం వ్యాపారిపై దాడి!

సంతలో రోజువారీ వసూళ్ల వివాదం..

ప్రశ్నించినందుకు చేయిచేసుకున్నారనే ఆరోపణలు

దాడిలో గాయపడి ఆసుపత్రి పాలైన వ్యాపారి గఫర్?

కొత్తగూడెం, నవంబర్ 19, ప్రజాజ్యోతి :



ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న వ్యాపారి గఫర్..

కొత్తగూడెం నగరపాలక సంస్థ పరిధిలోని సంతలో రోజువారీ వసూళ్ల విషయంలో తలెత్తిన వివాదం ఓ వ్యాపారిపై దాడికి దారితీసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం రూ.30 చెల్లింపు విషయంలో ప్రారంభమైన వాగ్వాదం చివరకు దాడి వరకు వెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనలో వ్యాపారి గఫర్ గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు స్థానికుల ద్వారా తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే.. సంతలో రోజువారీ వ్యాపారం చేసుకునే గఫర్ ప్రతిరోజూ మూడు వ్యాపార బండ్లను ఏర్పాటు చేసుకుంటున్నట్లు సమాచారం. అయితే గురువారం ఆయన కేవలం రెండు బండ్లతోనే వ్యాపారం నిర్వహించారు. ఈ క్రమంలో రోజువారీ వసూళ్లకు వచ్చిన వ్యక్తులు మూడు బండ్లకు సంబంధించిన రుసుము చెల్లించాలని కోరినట్లు తెలుస్తోంది. ఒక్కో బండికి రూ.30 చొప్పున మూడు బండ్లకు రూ.90 చెల్లించాలని వారు పట్టుబట్టగా, తాను రెండు బండ్లే ఏర్పాటు చేశానని, అందుకు రూ.60 మాత్రమే చెల్లిస్తానని గఫర్ పేర్కొన్నట్లు సమాచారం. తాను ఏర్పాటు చేయని మూడో బండికి కూడా డబ్బులు ఎందుకు చెల్లించాలని ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో వసూళ్లకు సంబంధించిన వ్యక్తులు గఫర్‌పై దాడి చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దాడిలో తీవ్రంగా గాయపడిన ఆయన ఆసుపత్రిలో చేరినట్లు సమాచారం. సంతలో వ్యాపారం చేసుకుని జీవనం సాగించే చిరువ్యాపారుల నుంచి వసూళ్ల పేరుతో ఇలాంటి వివాదాలు తలెత్తడం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి వసూళ్లకు సంబంధించిన నిబంధనలు ఏమిటి? వ్యాపారులు ఏర్పాటు చేసిన బండ్ల సంఖ్య ఆధారంగానే రుసుము వసూలు చేస్తున్నారా? ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడ్డారా? అనే అంశాలపై అధికారులు విచారణ జరపాల్సి ఉంది. ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెలికితీయాలని వ్యాపారులు కోరుతున్నారు.

కరువు మండలాలకు నిధులు కేటాయించాలి

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య

ములకలపల్లి నవంబర్ 19 (ప్రజాజ్యోతి):

కరువు మండలాలుగా ప్రకటించి రోజులు గడుస్తున్నా నేటికీ సహాయక చర్యలు చేపట్టకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య విమర్శించారు. గురువారం మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, మోరస్ తుపాను కారణంగా దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించాలని కోరారు. కరువు మండలాలకు ప్రత్యేక నిధులు కేటాయించి రైతులను ఆదుకోవాలని, దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలని, రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా కల్పించాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి దళారుల దోపిడీని అరికట్టి, ప్రతి గింజను ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కారం పుల్లయ్య, మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, కార్యదర్శివర్గ సభ్యులు పోడియం వెంకటేశ్వర్లు, ఊకంటి రవికుమార్, గౌరీ నాగేశ్వరరావు, మాలోతు రావుజ, నిమ్మల మధు, కుంజా రామ్మూర్తి, కీసరి వెంకట్రావు, గడ్డం వెంకటేశ్వర్లు, గోపగాని లక్ష్మీనరసయ్య, బైరు ప్రసాద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసీ హక్కుల సాధనకు ఐక్యంగా కదలాలి

–జిల్లా మహాసభలు విజయవంతం చేయండి

–టీఏజీఎస్ జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య

ములకలపల్లి నవంబర్ 19 (ప్రజాజ్యోతి):



ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణతో పాటు భూ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23న ములకలపల్లి మండల కేంద్రంలో నిర్వహించనున్న తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 4వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య పిలుపునిచ్చారు. గురువారం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం కుంజా రామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కారం పుల్లయ్య మాట్లాడుతూ.. మహాసభల సందర్భంగా ఎస్‌బీఐ బ్యాంకు నుంచి రాయల ఫంక్షన్ హాల్ వరకు ఆదివాసీలతో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న ఆదివాసీల భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, ఫారెస్ట్ వేధింపులు ఆపాలని, జీవో నంబర్ 3ను ఆర్డినెన్స్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీల హక్కులు, చట్టాలు, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న మూడు సంవత్సరాల కార్యాచరణపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ ఉద్యమాలకు దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ మిడియం బాబురావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్ హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గౌరీ నాగేశ్వరరావు, పోడియం వెంకటేశ్వర్లు, గడ్డం వెంకటేశ్వర్లు, రావుల నాగేంద్రబాబు, దుర్గయ్య, రాఘవయ్య, కొయ్యల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.